నానీ ఎవరో ఆ వ్య క్తికి తెలీదు.

కాని అప్పటికే షాపు వాడిని సమీపించిన వ్యక్తులెంతటి రాక్షసులో మాత్రం బాగా తెలుసు.

క్షణాలు గడుస్తున్నాయి.

నానీ గొంతునుంచి వెక్కిళ్ళు ఉధృతం కాసాగాయి.

*　　　*　　　*　　　*

"తిరిగొచ్చాడుగా..... కనీసం చావు కబురయినా తీసుకొచ్చాడా"

విశ్వేశ్వరశాస్త్రి నెమ్మదిగా మంచంపైనుంచి పైకి
లేచాడు భార్య కాంతమ్మని చూస్తూ.

కొన్ని రోజుల క్రితం కాలూ చేయీ ఆడక మంచం పట్టిన ఆయన ఈ మధ్య కొద్దిగా కూర్చోగలుగుతున్నాడు.

కాంతమ్మ నిశ్శబ్దంగా తలవంచుకునే వుందింకా "మీరు భోం చేయండి."

"ఎందుకు...... బ్రతకడానికా" ఆ వృద్ధుడి నేత్రాంచరాలలో నీళ్ళు నిలిచాయి "ఏ రోజయితే నా నమ్మకాలు సమూలంగా సమాధి అయిపోయాయో, ఏ రోజున నా కోడలు సజీవంగా దహనం చేయబడిందో ఆనాడే నేను చచ్చిపోయాను కాంతం.....ఇంకా ఎందుకు నా కోసం ఇలా ఆరాటపడతావు.... సంఘం
కోసమా? దానినుంచి యోజనాల దూరం ఎప్పుడో జరిగిపోయావు. సౌభాగ్యం కోసమా! నేను నిర్భాగ్యుడనై మంచం పట్టిన రోజునే నీ పసుపు కుంకుమలని కోల్పోయావు. ఎందుకు ఈ ఆత్మవంచన. శారీరకమైన ఈ పసుపు కుంకుమల అలంకారంతో నువ్వు సుమంగళినని సంఘానికి చెప్పుకోగలవుగాని ఏనాడో అమంగళానికి అంకురార్పణ చేసి మానసికంగా కళంకితురాలైన నువ్వు నీ మన్సుకి ఎలా జవాబు చెప్పుకుంటావు."

చీర చెరుగుని ఒంటికి చుట్టుకుని భర్త మాటలకి చెమ్మగిల్లిన కళ్ళతో చూస్తూ వుండిపోయింది తప్ప ఏమని జవాబు చెప్పగలదు?

"అయిపోయింది కాంతం.... ఇక నేనీ జన్మలో దక్కించుకోవాల్సింది, మూటగట్టుకోవాల్సిది అంతా పూర్తయింది..... ఇప్పుడు నేను బ్రతికి చేయాల్సింది కోరి యీ చెరనుంచి బయటకు పంపిన నా మనవడి యోగక్షేమాలేమన్నా వుంటే తెలుసుకోవడమే...." కళ్లనుంచి నీళ్ళు ధారా పాతంగా వర్షిస్తుంటే ఉద్వేగంతో అడిగాడు.... "కన్న కొడుకుని కడ తేర్చాలని వెళ్ళిన నీ ముద్దుల కొడుకు తిరిగొచ్చాడుకదే..... ఏమంటాడు? ఆ పసికందుకు అంత్యక్రియలకి సైతం దక్కకుండా
అనాధగానే చంపి ఏ కాలువలోనో పడేశానంటాడా....! లేక ఆ కార్యక్రమం ఇంకా పూర్తి కానందుకు కుమిలిపోతున్నాడా....మాట్లాడు కాంతం .... పతిని ప్రత్యక్ష దైవంగా

కొలిచేటంత పతివ్రతని నువ్వని నేను పొరపడటం లేదే. కొడుకు అవినీతిని సమర్థించే అపురూపమైన తల్లిగా జవాబు చెప్పు. ఏం చేశాడు నానీని? వాడెక్కడున్నాడు? ఏమయ్యాడు? ఆ ఒక్క విషయమూ తెలియ చెయ్యి."

"నాకు తెలీదండీ" వెక్కిపడుతూందామె "తెలీనిది చెప్పమని చెప్పి నన్నెందుకు హింసిస్తారు?"

"అలా కంటతడి పెట్టకు కాంతం .... నీ కన్నీళ్లని యింతగా వృధా చేయకు.... నేను పోయాక నీ చుట్టూ వున్న సంఘాన్ని మభ్య పెట్టడానికయినా కొన్ని నీటిబొట్లని పదిలంగా దాచుకో-"

"ఏమండీ" ఆమె పాదాలపై వాలిపోతుంటే కాళ్ళను  దూరంగా జరిపాడు.

"ఎందుకే ఈ పశ్చాత్తాపం, కాటికి కాళ్ళు చాపుకున్న నీకే బ్రతుకు సుఖాలపై యింతటి లాలసత్వం వుంటే నీ కూతురు లాంటి
ఆడపిల్లే పావని. గంగలా యీ యింట పారాడిన దేవతే. ఆ తల్లి పావని బ్రతుకు మూన్నాళ్ళ ముచ్చటగా ఎలా మార్చగలిగావు....
" ఆయన గొంతు  వణుకుతోంది "వాడ్ని నా చిట్టితండ్రిని నా సాంప్రదాయాలకీ నమ్మకాలకి వారసుడై మా వంశానికి
నిజమైన వెలుగు కిరణమవుతాడనుకున్న నానీని దూరంగా నేనే పంపేశాను.

ఎందుకంటే ఇంకిక్కడుంటే బ్రతకడని..... బ్రతుకుతూ మరెక్కడన్నా వుండాలని. ఎంతటి నిస్సహాయస్థితి అది.
ఉపనిషత్తుల సారాన్ని ఉద్భోదించానే కాని, కత్తులు దూసే ఆటవిక సత్యాలని ఎరుక పరచలేకపోయానే ఏడి....? వాడెక్కడ వున్నాడు-? ఎలా వున్నాడు?
చెప్పు-" ఆయన ఉద్వేగంతో ఊగిపోతున్నాడు.

"నానీ ఇల్లు వదిలి ఎన్నాళ్ళయింది?"

"ఏడు రోజులు"

"పావని పోయి..."

"పదిరోజులు.....!"

ఆయన గుండె కలుక్కుమంది "అంటే తల్లికి కొరివిపెట్టిన నానీ సాంప్రదాయకంగా తలనీలాలు అర్పించాల్సిన రోజు కదూ ఇది" ఓ నీటి బొట్టు సుడులు తిరుగుతూ ఆయన కనుకొలకుల్ని చేరుకుంది.

--

ఇక్కడ విశ్వేశ్వరశాస్త్రి ఇలా అనుకుంటున్న సమయానికి అక్కడ పట్టణంలో దుండగుల

బారినుంచి తప్పించుకున్న నానీ ఒక షాపులో అడుగుపెడితే అది బార్బర్ షాపు కావడంతో ఒక పసికందుని వెంటాడు తున్నారని గ్రహించిన ఆ షాపు యజమాని ఆ రాక్షసుల దృష్టి నానీ మీద పడకుండా పీకలదాకా బట్ట చుట్టి క్షురకర్మతో తల నీలాల్ని కత్తిరించడంలో నిమగ్నమయ్యాడు.

అప్పటికే హరి అనుచరులలో ఒకడు షాపులో అడుగుపెట్టాడు.

కాని గుండు చేయబడుతున్న పసిపిల్లవాడే నానీ అని అనుకోలేక పోయాడు. అలవాటుగా తనకు తను అద్దంలో చూసుకుని బయట ఒక షాపు దగ్గర నిలబడ్డాడు తన వాళ్లతో.

ఇదంతా గమనిస్తూనే వున్నాడు మంగలిషాపు యజమాని.

తల్లి మరణించిన పదోరోజు సాంప్రదాయకంగా జరగాల్సిన ఖర్మ కాండ పూర్తయింది చాలా యాదృచ్ఛికంగా.

అప్పుడు గుర్తొచ్చింది. ఊళ్ళో తన జుట్టు కత్తిరించుకున్నాక తాతయ్య డబ్బులిచ్చే విషయం.

దిగులుగా జేబులు తడుముకుంటున్న నానీని జాలిగా చూశాడు షాపు యజమాని.... "బాబూ! నువ్వడక్కుండానే నీ ఉంగరాల జుత్తుని కత్తిరించేశాను. కోపం తెచ్చుకోకు. వాళ్ళ దృష్టి నీ మీద పడకూడదని అంతే! నీకు తెలీదు బాబూ నిన్ను వెంటాడుతూ వచ్చారే ఆళ్ళెంత రాక్షసులంటే నడిరోడ్డు మీద నలుగురూ చూస్తుండగా నిలువునా ప్రాణాలు తీయగల సమర్థులు. నేను ఆళ్ళని ఎదిరించలేనయ్యా!"

అతడు సంజాయిషీలా అంత చెప్పుకున్నాడు.

చీకటిలోకి కదిలిన నానీకి ఇప్పుడు ఆ వ్యక్తులు కనిపించలేదు. కాని ఆ పరిసరాలు బాగా పరిచయమున్నవిగా కనిపించాయి.

రోడ్లు సందడిగా వున్నాయి.

అయినా దిక్కులు పరికిస్తూ నడిచి ఓ యింటిని చేరాడు.

ఆ ఇల్లే కొన్ని గంటలపాటయినా ఆశ్రయం ఇచ్చిన పర్ణశాల.

ఆ ఇంటిలోనే అమ్మ ప్రేమను చవి చూసింది.

తెరుచుకుని ఉన్న ద్వారం దాటి నిశ్శబ్దంగా లోపలికి అడుగుపెట్టాడు. అలికిడిలేని అనసూయ ఇల్లు. ఒక రోజు క్రితం హత్య జరిగిన మృత్యు గృహంలా లేదు. అమ్మ ఒడిలాగే అనిపించింది.

నిన్న అనసూయ నానీకి రక్షణ ఇవ్వడమే నిజమయితే ఆ ఫిల్మ్‌రోల్ ఆ ఇంటిలోనే బహుశా వుండవచ్చు అన్న మీమాంసతో డి.యస్పీ. సుందర్ తనే స్వయంగా అక్కడికి రాబోతున్నాడని తెలీని నానీ ఆకలితో అలాగే ఓ మూల సొమ్మసిల్లి నిద్రపోయాడు.

* * * *

"బ్రేవో మైడియర్ యశస్వీ!" ఉత్సాహంగా జేబులోని బాటిల్ తీసి మరో గుక్క తాగాడు

రామసూరి "ఒక పోలీసాఫీసరువయ్యుండి నీకేమి కాని ఓ పసికందు కోసం నువ్వు నమ్మిన నిజాన్ని కాపాడటం కోసం నువ్వు... నీలాంటి ఏ ఒక్కడు వున్నా చాలయ్యా
ఈ వ్యవస్థ రామరాజ్యంలా మారకపోయినా కనీసం రాక్షస నిలయం కాకుండా పోతుంది. " ఉద్వేగంతో అభినందించాడు.

ఎప్పుడో నిన్న రాత్రి హోటల్ గది వదిలివెళ్ళిన యశస్వి అరెస్టు కాబడటం, ఆ తర్వాత రామసూరి మూలంగానే విడుదల కావటం అంతా తెలిసిన హరిత నిశ్శబ్దంగానే వారి చర్చని వింటోంది తప్ప జోక్యం చేసుకోలేదు.

"మిష్టర్ యశస్వీ! కథ ఎక్కడ మొదలయినా ఇప్పుడు ఎంతదాకా మలుపు తిరిగినా ఇక ముందు మరిన్ని అనూహ్యమైన
సంఘటనలు ఎదుర్కోవల్సి రావచ్చన్నది నా నమ్మకం. ఎందుకంటే ప్రత్యర్థులు ఆప్పుడే జాగ్రత్త పడుతున్నారు. ఒక చిన్న అపశృతి చాలు. నానీ ప్రాణాలు మాత్రమే కాదు.. మన బ్రతుకులు గతి తప్పడానికి. అలా అని ఇది పిరికిమందు కాదు. సమస్య పరిధి విస్తృతం అవుతుంటే నిప్పు మంటగా, మంట దావానంలా మారుతుంది. అప్పుడు మనలో మరికొందరి ప్రాణలకే హాని కలుగుతుందన్నది నా నమ్మకం. సో.... నేను చెప్పేదొక్కటే..." సాలోచనగా నిట్టూర్చాడు
"ఇప్పటిదాకా నువ్వు తీసుకున్న ఇనీషేటివ్ చాలు. మిగతాది వదిలేయ్! తాడు పూర్తిగా నా చేతికొచ్చింది కాబట్టి మిగతా ముడులు
నేనే వేస్తాను."

జోక్యం చేసుకున్నాడు యశస్వి "నేను ఇక్కడకు వచ్చింది కాకతాళీయంగా మిమ్మల్ని సమస్యలోకి నెట్టి నేను ప్రేక్షకుడిగా కూర్చోవాలని కాదు."

"నీకు తెలియదు యశస్వీ! ప్రత్యర్థుల దృష్టిలోకి వెళ్ళిన నువ్వు అనాలోచితంగా అడుగువేస్తే ఎలాంటి ప్రమాదంలో ఇరుక్కునేది నువ్వూహించలేవు" అసహనంగా అన్నాడు రామసూరి.

అడ్డంగా తలూపాడు యశస్వి.
"యశస్వి, ఎందుకు చెబుతున్నానో తెలుసా! ఈ సొసైటీలో ఆపదలో వున్న మనిషిని రక్షించే వ్యవస్థలు, ప్రభుత్వమూ పోలీసులు- ఇప్పుడు ఆ రెండు వ్యవస్థలకీ శతృవులమైపోయాము. ఎవరు మన మొర ఆలకించేది?" నవ్వేడు నిర్లిప్తంగా "ఓ పత్రికా విలేఖరిగా సమస్యని ప్రజల దృష్టికి తేగలను.... జరుగుతున్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించేటట్టు చేయగలను. బట్ అపుడు ప్రజలు మనకేమన్నా సహకరించగలరనుకుంటున్నావా- నో.... వాళ్ళకు ఇంతకుమించిన సమస్యలున్నాయి".